
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

27 మండలాల్లో వర్షం


తాడిపత్రిలో జలమయమైన రోడ్డు

అనంతపురం అర్బన్, జూన్ 6: జిల్లాలోని 27 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. యల్లనూరు మండలంలో అత్యధికంగా 89.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడిపత్రిలో 75.0, యాడికి, రాప్తాడు 32.4, పుట్లూరు 31.4, కూడేరు 30.0, కళ్యాణదుర్గం 29.2, పెద్దవడుగూరు 23.2, అనంతపురం 22.0, ఉరవకొండ 21.6, పెద్దపప్పూరు 21.4, కణేకల్లులో 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 18.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. రాయదుర్గంలో గురువారం భారీ వర్షం కురిసింది. గుంతకల్లు, కళ్యాణదుర్గం, కంబదూరు, బెళుగుప్ప, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, బొమ్మనహాళ్, అనంతపురం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. యాడికి, గుత్తి, యల్లనూరు, పామిడి, పుట్లూరు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం 32.0 కనిష్ఠం 25.0






సూక్ష్మానికి మోక్షం కావాలి!

ఐదేళ్లుగా అటకెక్కిన సూక్ష్మసేద్య పథకం

రెండేళ్లు పూర్తిగా బంద్..
మూడేళ్లు అరకొరగా సరఫరా
టీడీపీ హయాంలో 90 శాతం సబ్సిడీ
కూటమి గెలుపుతో రైతుల్లో చిగురించిన ఆశలు



'అనంతపురం జిల్లా నా గుండెల్లో ఉంటుంది. మిమ్మల్ని ఆదుకునే బాధ్యత నాది. అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం ఎత్తేసిన అన్ని పథకాలను పునరుద్ధరిస్తాం. అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటాం..' అని టీడీపీ అధినేత చంద్రబాబు మాటిచ్చారు. 2014 ఎన్నికల్లో 12 మంది ఎమ్మెల్యేలను ఇచ్చినందుకు అనేక పథకాలతో ఆదుకున్నారు. అంతర్జాతీయ కార్ల తయారీ పరిశ్రమ 'కియ'ను కరువు నేలపైకి తీసుకొచ్చారు. రైతులకు సబ్సిడీ పథకాలు, నిరుద్యోగులకు భృతి, పేదలకు అన్న క్యాంటీన్, ఆపన్నులకు పింఛన్లు, యువతకు ఉద్యోగాలు.. ఇలా ఎన్నెన్నో చేశారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లా జనం అంతకు మించి.. మొత్తం 14 మంది ఎమ్మెల్యేలను ఇచ్చారు. వైసీపీకి వాయిస్ లేకుండా చేశారు. ఇక తమ కష్టాలను తీర్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు కూడా గతానికి మించి మేలు చేస్తారని ఆశిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరుతున్న నేపథ్యంలో.. వైసీపీ పాలనలో వివిధ రంగాలు, వివిధ వర్గాలు ఎదుర్కొన్న సంక్షోభం.. చంద్రబాబుపై పెట్టుకున్న ఆశల గురించి ప్రత్యేక కథనాలు.. నేటి నుంచి..!



అనంతపురం అర్బన్/యాడికి, జూన్ 6: సాగునీటి వనరులు నిర్వీర్యమై.. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను సూక్ష్మ సేద్య పరికరాలు ఎంతగానో ఆదుకున్నాయి. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఎస్సీ ఎస్టీ రైతులకు ఉచితంగా, మిగిలిన రైతులకు 90 శాతం సబ్సిడీతో టీడీపీ ప్రభుత్వం అందించేది. దీంతో అరకొరగా బోరు నీరున్నా.. వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలను రైతులు సాగు చేసుకోగలిగారు. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని మొదటి రెండేళ్లు పూర్తిగా అటకెక్కించింది. రైతుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో సబ్సిడీని 70 శాతానికి కుదించి.. మూడేళ్లపాటు అరకొరగా సరఫరా చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024 మార్చి 31 వరకు) ముగిసే వరకు సూక్ష్మసేద్య పరికరాలు సరఫరా చేయాల్సి ఉండగా.. ఎన్నికల కోడ్ అమలులోకి రాకనే.. జనవరి నుంచే నిలిపేశారు. దీంతో ఉద్యాన రైతులు మార్కెట్‌లో అధిక ధరలకు పరికరాలను కొనుగోలు చేయాల్సి వచ్చింది. కొనలేనివారు సాగుకు దూరమయ్యారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఇక తమ కష్టాలు తీరుతాయని రైతులు భావిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఎత్తేసిన పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ హామీ ఇచ్చారు. దీంతో సేద్యానికి మంచి రోజులు వచ్చినట్లేనని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో తేడా..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లా ఉద్యాన రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 2019-20 సంవత్సరంలో కేవలం 19,276 మంది రైతులకు 24,770.72 హెక్టార్లకు సరిపడా పరికరాలు ఇచ్చారు. ఆ తర్వాత 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో పూర్తిగా నిలిపేశారు. రైతులు, రైతు సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేక రావడంతో 2023-24 సంవత్సరంలో పరికరాల సరఫరాను పునరుద్ధరించారు. కానీ పెద్దగా ప్రయోజనం లేకపోయింది. టీడీపీ హయాంలో 2014-15 నుంచి 2018-19 దాకా ఉమ్మడి జిల్లాలోని 1,07,751 మంది రైతులకు 1,22,864. 24 హెక్టార్లకు సరిపడా సూక్ష్మసేద్య పరికరాలు సరఫరా చేశారు. వైసీపీ పాలనలో కేవలం 54,951 మంది రైతులకు 67,659. 48 హెక్టార్లకు సరిపడా పరికరాలను మాత్రమే ఇచ్చారు.



వైసీపీ పాలనలో సరఫరా ఇలా...

సంవత్సరం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (హెక్టార్లు)
2019-20	19,276	24,770.72
2020-21	-	-
2021-22	-	-
2022-23	19,045	22,883.45
2023-24	16,630	20,005,31
మొత్తం	54,951	67,659.48

టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లా రైతులకు అందిన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల వివరాలు

సంవత్సరం	రైతుల సంఖ్య	విస్తీర్ణం (హెక్టార్లు)
2014-15	7,726	8,355.42
2015-16	21,157	21,687.01
2016-17	22,181	24,637.40
2017-18	29,720	34,814.49
2018-19	26,967	33,369.92
మొత్తం	1,07,751	1,22,864.24

డబ్బు కట్టినా..



నాలుగు ఎకరాలకు డ్రిప్ పరికరాల కోసం ఏడాది క్రితమే డబ్బులు చెల్లించాను. డ్రిప్ పరికరాలు సరఫరా చేయలేదు. సబ్సిడీపోనూ రూ.35 వేలు కట్టినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. డ్రిప్ పరికరాలు ఇవ్వకపోవడంతో పంటలు సాగు చేయకపోయా. టీడీపీ కూటమి ప్రభుత్వం సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

- రాజశేఖర్‌నాయుడు, యాడికి మండలం

సబ్సిడీ కుదించి.. ద్రోహం

టీడీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో సూక్ష్మసేద్య పరికరాలకు ఒక్కో రైతుకు పది ఎకరాల దాకా 90 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం ఉచితంగా డ్రిప్ పరికరాలు సరఫరా చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే సూక్ష్మసేద్య పరికరాల మంజూరుకు గైడ్ లైన్స్‌ను మార్చారు. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీని ఎత్తేశారు. ఇతర సామాజికవర్గ రైతుల తరహాలోనే సబ్సిడీ పోను మిగతా డబ్బులు చెల్లించాలని వారికి షరతు పెట్టారు. సూక్ష్మ సేద్యానికి బాగా అలవాటు పడిన రైతులు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. సబ్సిడీని కుదించినా.. రైతులకు పూర్తి స్థాయిలో సరఫరా చేయలేదు.

చిగురించిన ఆశలు

అధికారం చేపట్టగానే గతంలో మాదిరే సూక్ష్మసేద్య పరికరాలకు 90 శాతం సబ్సిడీని వర్తింపజేస్తామని, రైతులను ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి అవుతున్నారు. దీంతో తమకు మంచి రోజులు వచ్చినట్లే అని కరువు జిల్లా రైతాంగం విశ్వాసం వ్యక్తం చేస్తోంది. పాత పద్ధతిలో 90 శాతం సబ్సిడీ ఇస్తారని, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని వర్తింపజేస్తారని భావిస్తున్నారు.

వైసీపీ హయాంలో నష్టపోయాం



నాలుగు ఎకరాల్లో డ్రిప్ కోసం ఏడాదిన్నర క్రితమే రూ.42 వేలు చెల్లించాను. అధికారులు, కంపెనీ సిబ్బందిని పలుమార్లు అడిగినా ప్రయోజనం లేకపోయింది. సూక్ష్మసేద్య పరికరాలు ఇస్తే ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఖరీఫ్ పంటలతోనే సరిపెట్టుకున్నాం. టీడీపీ కూటమి ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పరికరాలు సరఫరా చేసి ఆదుకోవాలి.

-మనోహర్ చౌదరి,యాడికి

నట్టేట ముంచారు..



వైసీపీ పాలనలో కరువు రైతులను నట్టేట ముంచారు. వ్యవసాయంలో సూక్ష్మసేద్య పరికరాల ప్రాధాన్యం బాగా పెరిగింది. కానీ వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ పథకాన్ని అటకెక్కించి రైతులకు తీరని అన్యాయం చేసింది. గత ఐదేళ్ల పాలనలో రెండేళ్లపాటు పూర్తిగా నిలిపేశారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ తర్వాత అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకున్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాలతో కరువు రైతులు సూక్ష్మసేద్య పరికరాలకు దూరమయ్యారు. అందుకే ఓటుతో తగిన గుణపాఠం చెప్పారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

- బొల్లు శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి

సబ్సిడీలను పునరుద్ధరించాలి..



వైసీపీ ఐదేళ్ల పాలనలో డ్రిప్, స్ప్రింకర్లకు సబ్సిడీ తగ్గించి రైతులకు తీరని అన్యాయం చేశారు. వరుసగా రెండేళ్లు పరికరాలు ఇవ్వకుండా ద్రోహం చేశారు. అందుకే రైతులు ఓటుతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. టీడీపీ హయాంలో సూక్ష్మసేద్య పరికరాలకు వర్తింపజేసిన సబ్సిడీని పునరుద్ధరించాలి. చంద్రబాబు రైతులకు ఇచ్చిన హామి మేరకు 90 శాతం సబ్సిడీతో తిరిగి పరికరాలు సరఫరా చేయాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని వర్తింపజేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కొడుతున్నారు బాబోయ్..!

నాటకాలు మొదలు పెట్టిన వైసీపీ నేతలు



కంటికి కన్ను.. పంటికి పన్ను అని బెదిరింపులు

ఐదేళ్ల అరాచకాలను మరిచిన తోపుదుర్తి, మాధవ్

అనంతపురం క్రైం, జూన్ 6: అధికారం చేపట్టాక ఐదేళ్లపాటు అరాచకం సృష్టించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, మీడియా ప్రతినిధులు.. ఇలా అందరిపైనా దాడులకు తెగబడ్డారు. తమకు దాసోహమైన పోలీసు అధికారుల అండతో రెచ్చిపోయారు. రాప్తాడు ఎమ్మెల్యే సోదరుడు స్వయంగా పలుమార్లు హింసాత్మక ఘటనలలో పాల్గొన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలతోపాటు సామాన్యులపై సైతం దాడికి దిగారు. అధికారం చేతులు మారడంతో ఇప్పుడు తమపై ఎక్కడ ప్రతీకార దాడులు జరుగుతాయోనని సీన్ క్రియేట్ చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాకనే 'దాడులకు తెగబడుతున్నారు' అని గగ్గోలు పెడుతున్నారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేస్తున్నారు, తమ ప్రాణాలను అడ్డుపెట్టి అయినా తమ పార్టీ కార్యకర్తల ప్రాణాలను కాపాడుకుంటామని అన్నారు. కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని, స్పందన లేకపోతే ఆత్మరక్షణకు కంటికి కన్ను.. పంటికి పన్ను నినాదంతో ముందుకుపోతామని బెదిరింపులకు దిగారు. టీడీపీ నాయకులు దాడులను నియంత్రించాలని నీతులు పలికారు. 'వైసీపీ అధికారంలోకి రాగానే మా వాళ్లకు మెసేజ్ పెట్టాం. ఓటమి బాధతో టీడీపీ వర్గీయులు దాడులు చేసినా సహించాలని, దగ్గరకు తీసుకోవాలని సూచించాం. మూడు రోజులుగా దాడులు చేస్తున్నా ఎమ్మెల్యే (పరిటాల సునీత) స్పందించడం లేదు..' అని తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మరి అప్పట్లో మెసేజ్ పెట్టుంటే.. విపక్ష శ్రేణులు, మీడియా ప్రతినిధులపై దాడులు ఎలా జరిగాయో..! బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు స్పందించలేదో..!


విలేకరుల సమావేశంలో తోపుదుర్తి, మాధవ్

ఇవి దాడులు కావా..?

- చెన్నేకొత్తపల్లిలో టీడీపీ నాయకుడు ఘంటాపురం జగ్గుపై ఏడాది క్రితం వైసీపీ కనగానపల్లి మండల కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి తదితరులు దాడి చేశారు. భూముల కోసం భయభ్రాంతులకు లోను చేశారు.
- ఫిబ్రవరి 18న రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడి చేశారు. వారిలో కనగానపల్లి మండలం కోనాపురానికి చెందిన బండి రవి కీలకం. 'ఎమ్మెల్యే ఇంటివద్ద ఉన్నా.. రండి..' అని పోలీసులకు సవాలు విసిరాడు. ప్రజాప్రతినిధిగా ఉండి.. రౌడీలను రక్షించి.. ఇప్పుడు నీతి వాక్యాలా..? బండి రవి వ్యవహారంలో పోలీసుల వైఖరి.. ఆ శాఖను నవ్వులపాలు చేసింది. హత్యాయత్నం కేసు నమోదైనా.. స్వగ్రామం కోనాపురంలోనే ఉంటూ ఎన్నికల ప్రచార సమయంలో టీడీపీ కార్యకర్తలపై బండి రవి దాడి చేశాడు. అయినా పట్టించుకోలేదు. 'ఎందుకు అరెస్టు చేయలేదు?' అని విలేకరులు అడిగితే.. 'ఎక్కడున్నాడో చెప్పండి.. పట్టుకుంటాం..' అని ఓ డీఎస్పీ అన్నారు. ఎవరి ఒత్తిళ్లతో నాటి పోలీసు అధికారులు వైసీపీ చొక్కాలు వేసుకున్నట్లు..?
- ఆత్మకూరు మండలంలో టీడీపీ కార్యకర్త వన్నూరుపై తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడు దాడికి దిగారు. అదే మండలంలో తోపుదుర్తి, రామగిరి మండలం పీఆర్ కొట్టాలలో టీడీపీలోకి చేరిన వారిని భయభ్రాంతులకు గురిచేశారు.

శ్రీకృష్ణపై దాడి చేసిన ఈ తోడేళ్ల మాటేమిటి..?



అప్పుడేమయ్యారు మాజీ పోలీసూ..?

సొంతపార్టీవారు అరాచకాలకు పాల్పడుతున్నా.. పోలీసు శాఖలో పనిచేసిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పల్లెత్తు మాట అనలేదు. ఇప్పుడు శాంతి వచనాలు వల్లిస్తున్నారు. ఎవరూ ఏమీ అనకున్నా.. బెదిరింపులకు దిగుతున్నారు. ఐదేళ్లపాటు అరాచకాలకు పాల్పడినవారికి ఓటర్లు బుద్ధి చెప్పారు. బాధితులు ఎవరూ ప్రతీకారాలకు పోవాలని కోరుకోవడం లేదు. ఐదేళ్లపాటు వైసీపీ నాయకులు ఎలా వ్యవహరించారో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రజలు శాంతిభద్రతలే కోరుకుంటారు.

ముగిసిన ఎన్నికల కోడ్

అనంతపురం టౌన్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ గురువారం ముగిసింది. మార్చి 16 నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల పక్రియ ముగియడంతో కోడ్‌ను ఎత్తి వేస్తూ ఎన్నికల కమిషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నేటి నుంచి సాధారణ పరిస్థితులలో ప్రజానీకం వ్యవహారాలు కొనసాగించవచ్చు.

అధికారుల సహకారం మరువలేనిది: కలెక్టర్

జిల్లాలో ఎన్నికల పక్రియను పారదర్శకంగా పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి వివిధ శాఖల అధికారులు అందించిన సహకారం, విధులలో భాగస్వామ్యం మరవలేనిదని కొనియాడారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పోలీసు శాఖ అధికారులు సహకరించారని పేర్కొన్నారు. ఎన్నికలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అధినేతను కలిసిన అనంత విజేతలు

అనంతపురం అర్బన్/ఉరవకొండ/ధర్మవరం, జూన్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును అనంతపురం తెలుగు తమ్ముళ్లు గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో వారు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉరవకొండ, రాయదుర్గం, అనంతపురం అర్బన్, ధర్మవరం విజేతలు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి ప్రసాద్, సత్యకుమార్‌యాదవ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి.. చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.


చంద్రబాబుతో పయ్యావుల కేశవ్


కాలవ శ్రీనివాసులు..


దగ్గుపాటి ప్రసాద్


సత్యకుమార్ యాదవ్


మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

హెచ్చెల్సీ వాటా 26.36 టీఎంసీలు

టీబీ డ్యాంలో 172 టీఎంసీల నీటి లభ్యత

అంచనా వేసిన తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు

మూడు రాష్ట్రాల ఎస్ఈలతో సమావేశం

రాయదుర్గం, జూన్ 6: తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది 172 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని బోర్డు అంచనా వేసింది. కర్ణాటక రాష్ట్రం.. హోస్పేట్‌లోని టీబీబోర్డు కార్యాలయంలో బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతపురం ఎస్ఈ రాజశేఖర్, కర్నూలు ఎల్లెల్సీ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, కర్ణాటక ఎల్‌బీఎంసీ ఎస్ఈ బసవరాజ్‌నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. నీటి లభ్యత అంచనాల ఆధారంగా ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల వాటాను నిర్ణయించారు. 2024-25లో ముందస్తు రుతుపవనాల కారణంగా జలాశయానికి 172 టీఎంసీల నీరు చేరుతుందని అంచనా వేశారు. ఏపీ వాటాగా 53.953 టీఎంసీలను కేటాయించారు. అందులో ఫ్లోరేటా ప్రకారం హెచ్చెల్సీకి 26.368 టీఎంసీలు, ఎల్లెల్సీకి 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 8.113 టీఎంసీల నీరు అందుతాయని అంచనా వేశారు. తెలంగాణ వాటా కింద 5.282 టీఎంసీల నీటిని ఆర్డీఎస్ కాలువ ద్వారా అందించాలని నిర్ణయించారు. కర్ణాటకకు 112.765 టీఎంసీల నీటిని కేటాయించారు. ఫ్లోరేటా ప్రకారం హెచ్చెల్సీకి 13.440 టీఎంసీలు, రాయబసవ కెనాల్‌కు 5.376 టీఎంసీలు, ఆర్డీఎస్ కెనాల్‌కు 1.912 టీఎంసీలు, ఎల్‌బీఎంసీకి 71.423 టీఎంసీలు అందించాలని నిర్ణయించారు. తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీల. ఆరునెలల పాటు ఎగువ ప్రాంతాల్లో ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురుస్తాయని, నీటి లభ్యత ఆశాజనకంగానే ఉంటుందని భావిస్తున్నారు. 200 టీఎంసీలకుపైగా నీటి లభ్యత ఉంటే బచావత్ అవార్డు ప్రకారం కాలువలకు కేటాయించిన నీటిని అందించే అవకాశం ఉంటుందని బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీకి బచావత్ ట్రిబ్యునల్ 32.5 టీఎంసీల నీరు కేటాయించారు. కానీ ఈ ఏడాది నీటి లభ్యతను బట్టి 26.368 టీఎంసీలు ఇవ్వాలని నిర్ణయించారు. జూలై 20వ తేదీన హెచ్చెల్సీకి ఏపీ వాటా నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు సమావేశంలో తీర్మానం చేశారు. జలాశయంలోకి ముందుగానే నీరు చేరితే నిర్ణయించిన తేదీకంటే ముందే నీటిని విడుదల చేసే అంశాన్ని కూడా చర్చించారు.


హోస్పేటలోని తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు కార్యాలయంలో సమావేశమైన మూడు రాష్ట్రాల ఎస్ఈలు

అడ్డగోలు బదిలీలకు బ్రేక్

వైసీపీని మోసిన టీచర్లకు షాక్

ఎన్నికలకు ముందు దొడ్డిదారి బదిలీలు

ఫిర్యాదు చేసిన జేఏసీ, కూటమి పెద్దలు

స్పందించిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

అనంతపురం విద్య, జూన్ 6: వైసీపీ పాలనలో ఐదేళ్లు బడిని మర్చిపోయారు. తాము ఉపాధ్యాయులమన్న సంగతి మర్చిపోయారు. వైసీపీ ప్రభుత్వాన్ని భుజాన మోశారు. పైరవీలతో పబ్బం గడుపుకున్నారు. ఎన్నికలు సమీపించగానే అధికార పార్టీ నాయకుల అండతో, రూ.లక్షలు వెచ్చించి అడ్డగోలుగా బదిలీలు చేయించుకున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఉన్న పలు పాఠశాలలకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు. ఎన్నికలు పూర్తవ్వగానే ఆగమేఘాల మీద బడిలో వాలిపోదామని అనుకున్నారు. కానీ అధికారం చేతులు మారింది. కోడ్ అమలులో ఉండటం, పోలింగ్, కౌంటింగ్‌కు మధ్య చాలా రోజుల వ్యవధి ఉండటంతో కొందరు సంఘాల నాయకులు, ఉపాధ్యాయుల ఎత్తులు పారలేదు. అడ్డగోలు బదిలీలను ఆపేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేయడంతో వారి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయింది.


ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు

అడ్డగోలుగా బదిలీలు

జిల్లాలో 49 వరకూ అడ్డగోలు ఆర్డర్లు తెచ్చుకున్నట్లు సమాచారం. వైసీపీ పెద్దలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులను పట్టుకుని చాలా మంది పైరవీలు చేశారు. అనంతపురం, రూరల్ మండలం, బుక్కరాయసముద్రం, ఇతర సమీప మండలాల్లోని పలు స్కూళ్లకు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఎస్‌జీటీలు 11 మంది, స్కూల్ అసిస్టెంట్లు 30 మంది, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ముగ్గురు, పీఈటీలు ముగ్గురు, గ్రేడ్ -2 హెచ్ఎంలు ఇద్దరు ఇలా బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కొందరు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు ముడుపులు కట్టారని తెలిసింది. తాము వైసీపీకి వీరవిధేయులమని, వైఎస్ఆర్‌టీఏ నాయకులమని చెప్పుకుని.. వైసీపీ పెద్దలను పట్టుకుని ఉత్తర్వులు తెచ్చుకున్నారు. దీనిపై అప్పట్లో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేక వచ్చింది.

జగన్‌పై భక్తి

అడ్డగోలుగా ఆర్డర్లు అందుకున్న నాయకులు కొందరు వైసీపీ కోసం ఎన్నికల్లో ప్రచారం చేశారు. డిన్నర్ రాజకీయాలు నడిపారు. పగలు ఉపాధ్యాయులుగా.. సాయంత్రం పార్టీ నాయకులుగా ద్విపాత్రాభినయం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టింది. అయినా ఆ పార్టీకి విధేయులుగా సంఘాల నాయకులు రాజకీయం నెరపడం పట్ల ఉపాధ్యాయులు విమర్శలు గుప్పించారు. వైసీపీ కోసం ఎన్నికల రాజకీయాలు చేసినవారిలో వైఎస్ఆర్‌టీఏ నాయకులతోపాటు కొందరు ఏపీటీఎఫ్ నాయకులు కూడా ఉన్నారు. ఇబ్బందులు పడుతున్న సగటు ఉపాధ్యాయులను వదిలేసి.. జగన్‌కు మళ్లీ ఓటు వేయాలని ప్రచారం చేయడం ఏమిటని అప్పట్లోనే మండిపడ్డారు.

ఉత్తర్వుల నిలిపివేత

బదిలీలపై బ్యాన్ ఉన్న సమయంలో వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని కొందరు అడ్డగోలుగా బదిలీల ఉత్తర్వులు తెచ్చుకున్నారు. మరో వారం రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభమౌతాయి. అడ్డగోలు బదిలీలు తెచ్చుకున్నవారు వెంటనే స్కూళ్లలో చేరి సుఖంగా గడుపుదామని అనుకున్నారు. కానీ వారి అక్రమాలను పసిగట్టి, సిఫార్సు బదిలీలపై విద్యాశాఖకు పలువురు ఫిర్యాదులు చేశారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వ పెద్దలు, జేఏసీ నాయకులు ఫిర్యాదు చేయడంతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి స్పందించారు. బదిలీ ఉత్తర్వులను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులు డీఈఓలకు గురువారం చేరాయి.

93 మంది ఉపాధ్యాయులకు శిక్షణ

అనంతపురం విద్య, జూన్ 6: జిల్లాలోని 1, 2 తరగతులు బోధించే 93 మంది టీచర్లకు రెండురోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. గురువారం న్యూటౌన్ బాయ్స్ హైస్కూల్‌లో శిక్షణను ప్రారంభించారు. శిక్షణను డీఈఓ వరలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లాసుల్లో కూర్చొని ట్రైనింగ్ క్లాసులు విన్నారు. తర్వాత డీఈఓ మాట్లాడుతూ పిల్లలకు తరగతులు బోధించే సమయంలో ఉపాధ్యాయులు ఓర్పు, నేర్పుతో ఉండాలని సూచించారు. పిల్లలకు తమ సొంత పిల్లలుగా భావించి బోధన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగానాయక్, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్లాసులు వింటున్న డీఈఓ


చంద్రబాబు చిత్రపటం ఏర్పాటు అనంతరం టీఎన్ఎస్ఎఫ్ నాయకుల నినాదాలు

ఎస్కేయూలో చంద్రబాబు చిత్రపటం ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయాన్ని సాధించడంతో నూతన సీఎంగా నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం ఎస్కేయూ వీసీ చాంబర్‌లో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు చంద్రబాబునాయుడి చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. ఇక నుంచి ఉద్యోగులను, సిబ్బందిని వేధించడం, అరాచకాలకు పాల్పడటం వంటి చర్యలకు తావులేకుండా పాలన సాగుతుందని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా వర్సిటీ పాలన ఉండబోతోందని సీఎంగా చంద్రబాబునాయుడు మళ్లీరావడం అన్ని వర్గాలకు శుభపరిణామమని పేర్కొన్నారు.

రానున్న ఐదు రోజుల్లో పిడుగులతో కూడిన వర్షం

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు

వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, జూన్ 6: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయని రేకులకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్ర వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో వర్షం కురుస్తుందన్నారు. పిడుగులు పడే అవకాశం ఉందని, గాలి కూడా ఎక్కువగా వీయనుందన్నారు. రాయలసీమ, ఉత్తర రాయలసీమ పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రం మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో ఉందన్నారు. పలు చోట్ల గాలులు గంటకు 30-40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. అనంత, సత్యసాయి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తారు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల పడే అవకాశముందని పేర్కొన్నారు.

రేపు హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం, జూన్ 6: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో శనివారం సీనియర్ పురుషుల హాకీ జిల్లా జట్ల ఎంపికను చేపడతున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్, హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ బంధనాధం సూర్యప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు ధర్మవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 01-01-1995 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆధార్ కార్డు, బర్త్‌సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని కోరారు.

9 వరకు స్పాట్

అనంతపురం విద్య, జూన్ 6: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. గురువారం స్పాట్ ప్రారంభమైం ది. పలు జిల్లాల నుంచి 15 వేలకుపైగా జవాబు పత్రా లు జిల్లాకు రాగా వాటి మూల్యాంకనం కోసం 254 మంది సీఈ,ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

చీనీకాయలు టన్ను రూ.40 వేలు

అనంతపురంరూరల్, జూన్ 6: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.18 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 684 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బీటెక్ మూక్స్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 6: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు(మూక్స్) పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు గురువారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మేలో తృతీయ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్, నాల్గవ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ (ఆర్20) మూక్స్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 6: టూవీలర్ రిపేరీకి సంబంధించి శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని, బైక్ రిపేరీతోపాటు ఇంగ్లీష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఉంటుందన్నారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పదోతరగతి, ఐటీఐ, ఇంటర్ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేస్తామని, శిక్షణ అనంతర ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9390505952, 7780752418లను సంప్రదించాలని కోరారు.

కొండచిలువ పట్టివేత

కొత్తచెరువు, జూన్ 6: మండల కేంద్రంలోని ఓ కోళ్ల ఫారంలోకి ప్రవేశించిన కొండచిలువను పట్టుకున్నారు. గాజుల సూర్యనారాయణ వ్యవసాయ బావి వద్ద షెడ్‌లో కోళ్ల పెంపకం చేపట్టారు. గురువారం కోళ్లషెడ్‌లోకి ఐదు అడుగుల పొడవు ఉన్న కొండ చిలువ ప్రవేశించి రెండు కోళ్లను మింగేసింది. విషయాన్ని గమనించిన సూర్యనారాయణ స్నేక్‌క్యాచర్ లక్ష్మయ్యకు సమాచారం అందించడంతో ఆయన ఆ కొండ చిలువను పట్టుకుని నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెట్టారు.


కొండచిలువను పట్టుకున్న లక్ష్మయ్య

ఎన్నికల్లో విజేతలకు ఈ-పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు

తపాలాశాఖ వినూత్న కార్యక్రమం



అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపేందుకు తపాలశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ-పోస్ట్ విషెస్ పేరుతో గురువారం కొత్త సంప్రదాయానికి తెరతీసింది. తపాలశాఖ తీసుకున్న ఈ-పోస్ట్ శుభాకాంక్షల విలువ రూ.10లు పోస్ట్, జీఎస్టీ రూ.2తో కలిపి రూ.12. శుభాకాంక్షలు తెలిపే వారు తమ దగ్గరలోని పోస్టాఫీసులో నాయకుడి పేరు, నియోజకవర్గాన్ని తెలియపరిస్తే సంబంధిత పోస్టాఫీసు అధికారులు ఏ4 రూపంలో ఆ సందేశాన్ని ఈ-పోస్ట్ ద్వారా ఆ ప్రాంత పోస్టాఫీసుకు చేరవేస్తారు. వారు ఆ సందేశాన్ని సాఫ్ట్‌కాపీగా మార్చి ఆ నాయకుడి ఇంటికి చేరవేస్తారు. దీనిద్వారా పల్లెటూరు నుంచి ప్రధానమంత్రికి కూడా శుభాకాంక్షలు తెలుపవచ్చు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది. ఈ నేపథ్యంలో తమకిష్టమైన నాయకులకు శుభాకాంక్షలు ఈ పోస్ట్ ద్వారా తెలిపే అవకాశాన్ని తపాలాశాఖ కల్పించింది.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఈ-పోస్ట్ విషెస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఏ ప్రాంతంలో ఉన్న నాయకులకైనా శుభాకాంక్షలు తెలుపవచ్చు.

- గుంపస్వామి, తపాలాశాఖ సూపరింటెండెంట్

ఉప్పొంగిన పాతాళగంగ

గోరంట్ల, జూన్ 6: పాతాళగంగ ఉప్పొంగింది. మండలంలోని గౌనివారిపల్లి సమీపాన పొలంలో నీరు ఉబికి వస్తోంది. మండలంలో బుధవారం రాత్రి 19.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గౌనివారిపల్లికి చెందిన ఎర్రగుట్ల సోమిరెడ్డి పొలంలో నీరు నిలిచింది. గ్రామస్థులు అది వర్షపు నీరు అనుకున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలైనా నీరు అలాగే ఉండటంతో వారికి అనుమానం వచ్చింది. కొంతమంది యువకులు, రైతులు పరిశీలించగా, భూమి నుంచి నాలుగుచోట్ల నీరు ఉబికి వస్తున్నట్లు తేలింది. ఒకచోట అధికంగా, మిగిలిన చోట్ల తక్కువగా నీరు వస్తోంది. నీరు ఉబికి వస్తున్న చోట చేతులు అడ్డుపెట్టినా ఆగడం లేదన్నారు. గ్రామంలో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటు శబ్దం వచ్చిందని, అది సోమిరెడ్డి పొలంలో పడి ఉండొచ్చని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంతోనే నీరు ఉబికి వస్తోందని భావిస్తున్నారు.


పొలంలో నీటిని పరిశీలిస్తున్న స్థానికులు

పాలిసెట్ కౌన్సెలింగ్ సందడి

సర్టిఫికెట్ల పరిశీలనకు ఆఖరి రోజు కావడంతో పోటెత్తిన విద్యార్థులు

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు: కన్వీనర్

అనంతపురం సెంట్రల్, జూన్ 6: పాలిసెట్ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు భారీగా తరలివచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలనకు గురువారం చివరి రోజు కావడంతో ఎక్కువ సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ జరిగింది. 500 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రివరకు సాగింది. ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ కళాశాలల్లో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినా జిల్లా కేంద్రంలోని కళాశాలకే విద్యార్థులు తరలివచ్చారు. షెడ్యూల్ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 3న ప్రారంభం కావాల్సి ఉండగా ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం నిర్వహించారు. ఇందుకు అవసరమైన కుల, ఆదాయ, స్టడీ తదితర సర్టిఫికెట్లను మంజూరు చేసే అధికారులు అందుబాటులేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యామని విద్యార్థులు వాపోయారు. వెరిఫికేషన్ ప్రక్రియ గడువును పొడిగించాలని స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులను విద్యార్థులు కోరుతున్నారు.

అవగాహనా లోపం

కౌన్సెలింగ్ కేంద్రాలను ఏయే కళాశాలల్లో ఏర్పాటుచేశారో అధికారులకే తెలియని స్థితి నెలకొంది. మదనపల్లి, పీలేరు ప్రాంతాలకు చెందిన అనేకమంది విద్యార్థులను అనంతపురం వెళ్లాలని అక్కడి పాలిటెక్నిక్ కళాశాలల అధికారులు సూచించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వారు ఇక్కడ జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. హిందూపురం, కళ్యాణదుర్గం కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటుచేసినా సమాచార లోపంతో ఆయా ప్రాంతాల మండలాలకు చెందిన విద్యార్థులు సైతం అనంతపురం వచ్చారు. మరోవైపు ఎస్టీ కేటగిరికి చెందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలో చేపట్టారు. ఎస్సీ కేటగిరికి చెందిన విద్యార్థులను కూడా ఇక్కడికే పంపించడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది. విద్యార్థులు పెద్దఎత్తున తరలిరావడంతో వారిని కట్టడి చేయడానికి కౌన్సెలింగ్ నిర్వాహక కన్వీనర్ జయచంద్రారెడ్డి, సిస్టమ్ అడ్మిషన్ సరిత ఇతర అధికారులు నానా తంటాలు పడ్డారు.


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులు శుక్రవారం నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని కౌన్సెలింగ్ కన్వీనర్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ ద్వారానే విద్యార్థులు వారికి నచ్చిన కళాశాలలు, బ్రాంచ్(కోర్సు)లు ఎంపిక చేసుకోవచ్చునన్నారు. 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

వేతన బకాయిలు ఇవ్వండి

సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులు

విడపనకల్లు, జూన్ 6: బకాయి వేతనాలు ఇవ్వాలని సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ వేధిస్తున్నాడన్నారు. ఫిబ్రవరిలో నిరసన తెలుపగా నాలుగు నెలల వేతనాలు ఇచ్చారని, తరువాత ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. వేతనాల విషయం అటు కాంట్రాక్టర్‌గాని ఇటు అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం లేదని చెబుతున్నారన్నారు. ఇలా చేస్తే కుటుంబాలను ఎలా పోషంచుకోవాలని ప్రశ్నించారు. పీఎఫ్ మంజూరు చేయాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. తమకు వేతనాలు అందే వరకు తాగునీటిని సరఫరా కానీయమని వివరించారు. కాంట్రాక్టు కార్మికులు నిరసన వ్యక్తం చేయడంతో తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా బంద్ అయ్యింది. ఈ కార్యక్రమంలో కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు



నారాలోకేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్వామిదాస్, వెంకటప్ప

నారాలోకేశ్‌ను కలిసిన నాయకులు

అనంతపురం అర్బన్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను విజయవాడలోని ఆయన నివాసంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప. నారా లోకేశ్‌ను కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మీసంపై మాట మార్చిన తోపు



అనంతపురం సిటీ, జూన్ 6: పరిటాల సునీత గెలిస్తే.. మీసం కొరిగించుకుంటా.. అని కొన్ని రోజుల కిందట ఓ చానెల్ ఇంటర్వ్యూలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్న విషయం తెల్సిందే. ఈ ఎన్నికల్లో పరిటాల సునీత ఘనంగా సాధించింది. తోపు ఓటమి పాలయ్యాడు. ఇదే విషయమై ఈనెల 4వ తేదీన 'తోపుదుర్తి మీసం కొరిగించుకుంటాడా..?' అని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఆ వార్త సోషల్ మీడియాలో తెగ వైరలైంది. దీనిపై అటు టీడీపీ, వైసీపీ వర్గాల్లో జోరుగా చర్చ సాగింది. ఈ నేపథ్యంలో తాజాగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఓ విలేకరి తోపు చేసిన సవాల్‌ను గుర్తు చేశాడు. చేసిన సవాల్ మేరకు మీసం తీసుకుంటారా అని ప్రశ్నించారు. దీనికి తోపు సమాధానమిస్తూ... 'ధర్మవరం ఎమ్మెల్యే సీటు రాకుంటే పరిటాల శ్రీరామ్ రాజకీయ సన్యాసం చేస్తామన్నారు కదా.. చేయమనండి.. అదే విధంగా వచ్చే ఆరు నెలల్లో ఇచ్చిన హామీలన్నీ పరిటాల సునీతను నెరవేర్చమనండి.. అప్పుడు నా మీసాలు తీయించుకుంటా..?' అని మాట మార్చారు. ఇలా తోపు మాట మార్చిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది.



కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో టీసీ వరుణ్ ప్రచారం, దగ్గుపాటికి మద్దతు ప్రకటిస్తున్న భవాని రవికుమార్, దగ్గుపాటి సతీమణితో కలిసి పెండ్యాల శ్రీలత ప్రచారం

కూటమి విజయంలో సైనికులే కీలకం

- పవన్ పిలుపుతో స్వచ్ఛందంగా ప్రచారాలు
- సొంత ఖర్చులతో ర్యాలీలు, బహిరంగ సభలు
- అన్నీ తామై వ్యవహరించిన ఆ ముగ్గురు...

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 6: జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయంలో జనసైనికులు కీలక పాత్ర పోషించారు. కేంద్రంలో పెద్దలను ఒప్పించడం.. రాష్ట్రస్థాయిలో నేతలతో పొత్తుల కుదర్చ డంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన కృషి మరువలేనిది. తనకొచ్చిన సీట్లను సైతం త్యాగం చేసి.. అసంతృప్తితో ఉన్న ఆ పార్టీ నేతలను సైతం బుజ్జగించి అందర్నీ ఏకతాటిపైకి తెచ్చి కూటమి విజయం సాధించేలా చేశారు. జిల్లాలో పలువురు జనసైనికులు టికెట్ ఆశించినా.. పొత్తులో భాగంగా త్యాగం చేయాల్సి వచ్చింది. అయినా నిరుత్సాహ పడకుండా కూటమి అభ్యర్థుల విజయం కోసం శ్రమించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల కోసం ప్రచారాలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, ఆ పార్టీ రాయలసీమ మహిళా విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్లు పెండ్యాల శ్రీలత సైనికుల్లా పోరాటం చేశారు. వీళ్ల ముగ్గురు కూటమి అభ్యర్థులను గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు. టీసీ వరుణ్ తన సొంత ఖర్చులతో బైకు ర్యాలీలు, బహిరంగ సభలతో కూటమి అభ్యర్థులను ప్రజలకు చేరువ చేశారు.

ఎప్పటికప్పుడు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయపరిచి ప్రతి డివిజన్‌లో సమస్యలను ఎత్తిచూపడంతో పాటు... కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారాలు చేశారు. భవాని రవికుమార్ సైతం ఉమ్మడి అనంత జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కూటమి టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో తనవంతు పాత్ర పోషించారు. భారీ కాన్వాయ్‌తో ప్రచారాలు నిర్వహించి కూటమి అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక పెండ్యాల శ్రీలత ఎన్నికల కోడ్ రాకమునుపు నుంచి వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై ఓ యుద్ధం చేశారు. ఆ పార్టీ మహిళా కార్యకర్తలను వెంటబెట్టుకొని అనంతపురం అర్బన్‌లోని ప్రతి డివిజన్‌లో తిరుగుతూ సమస్యలను తెలుసుకుంటూ వైసీపీ ప్రభుత్వ అధ్వాన పాలనపై నిప్పులు చెరిగారు. అనంతరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ సతీమణితో కలిసి ప్రచారాలు చేశారు. ఇలా కూటమి అభ్యర్థుల విజయంలో ఈ ముగ్గురు నేతలు శక్తివంచన లేకుండా కృషి చేశారనడంలో ఎలాంటి సందేహం లేదనే చెప్పాలి.

షెల్టర్‌హోంను సందర్శించిన న్యాయాధికారి



షెల్టర్‌హోంలో సమస్యలపై వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, జూన్ 6: అనంతపురం నగరంలోని కమలానగర్‌లో మహిళల నివాస వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ గురువారం సందర్శించారు. షెల్టర్‌హోంలో ఉన్నవారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. సమస్యలున్నవారు న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

సెబ్ డిప్యూటీ కమిషనర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయశేఖర్

అనంతపురం క్రైం, జూన్ 6: సెబ్ అనంతపురం జోన్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్‌కు బెస్ట్ డిప్యూటీ కమిషనర్ అవార్డు దక్కింది. ఎన్నికల సమయంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం వాహనాలను పట్టుకోవడంలో కృషి చేసిన ఈయనకు ఆ అవార్డు దక్కింది. గురువారం మంగళగిరిలోని సెబ్ హెడ్‌క్వార్టర్స్‌లో సెబ్ కమిషనర్ రవిప్రకాష్ చేతులమీదుగా ఆయన ఆ అవార్డు అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



మొదటిరోడ్డు శివాలయంలో పూజలు

అనంతపురం కల్చరల్, జూన్ 6 : వైశాఖ బహుళ అమావాస్యను పురస్క రించుకుని గురువారం నగరంలోని పలు ఆలయాల్లో శని త్రయోదశి పూజ లను నిర్వహిం చారు. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాల యంలో శనేశ్వరుని మూల విరా ట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి ట్రస్టు ఆధ్వ ర్యంలో తపో వనంలోని శివశక్తి దేవాలయంలో పూజలు నిర్వహిం చారు. శనేశ్వరునికి నువ్వుల నూనెతో తైలాభిషేకం చేయడంతోపాటు నువ్వులు, బియ్యంతో కలిపిన ప్రత్యేక పదార్థాలు, పిండివంటలతో నివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీరాములు, దేవేంద్ర, కెకె గాంధీ, దీప, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయ కళలతో మానసికోల్లాసం



సంప్రదాయ నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్, జూన్ 6: సంప్రదాయ కళలను అభ్యసించడం వల్ల చిన్నారుల్లో మానసికోల్లాసం పెరుగుతుందని సీనియర్ నాట్యాచార్యుడు పామిడి షన్ముఖనాయుడు పేర్కొన్నారు. కళాసాగర్ డ్యాన్స్, ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం ముగింపును పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక కృష్ణకళామందిర్‌లో కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కరాటేతో పాటు శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో వీక్షకులను అలరించారు. కళాసాగర్ డ్యాన్స్, ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు కత్తి విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్, హరి పాల్గొన్నారు.

కవితా సంపుటాల ఆహ్వానం

అనంతపురం కల్చరల్, జూన్ 6: విమలాశాంతి సాహిత్య పురస్కారాల కోసం కవుల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు విమలాశాంతి సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు శాంతినారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురించబడిన వచన కవితా సంపుటాలు మాత్రమే పురస్కారాలకు అర్హత కలవన్నారు. శతకాలు, నానీలు, పద్యకావ్యాలను పోటీలకు స్వీకరించబడవన్నారు. కాబట్టి అర్హత గల కవులు తమ కవితా సంపుటాలను నాలుగు కాపీలు చొప్పున జూలై 15వ తేదీలోపు 'ఉప్పరపాటి వెంకటేశులు, డోర్ నెం.16-37-1, రాహుల్ నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం - 515 004' చిరునామాకు పోస్టుద్వారా పంపాలన్నారు.

9న మహిళల సున్నీ ఇజ్‌తేమా

జిల్లా కేంద్రంలోని గుత్తిరోడ్డు రాణినగర్‌లోని బహీమీ బైతుల్ మాల్ షాదీ మహల్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ముస్లీం మైనార్టీ మహిళల సున్నీ ఇజ్‌తేమా నిర్వహిస్తున్నట్లు తెహరికె ఫైజానే ఉమర్ ఫారుక్ సంస్థ అధ్యక్షుడు హజరత్ హసన్ రజా ఖాద్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇజ్‌తేమాకు జిల్లాలోని ముస్లీం మైనార్టీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బాలాజీ డీఎడ్‌లో అడ్మిషన్స్ ప్రారంభం

అనంతపురం రూరల్: నగరంలోని ఖాజానగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాలాజీ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలలో రెండు సంవత్సరాల డీ.ఈఎల్, ఈఎడ్ (డీ.ఎడ్) కోర్సుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వీరప్రకాష్ తెలిపారు. డీఎడ్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు వెబ్ ఆప్షన్స్ ఇవ్వడానికి ఈనెల 8వతేదీ ఆఖరన్నారు. కౌన్సిలింగ్‌లో సందేహాలుంటే 99493 57599 నెంబరను సంప్రదించాలన్నారు.

తోపు సొంత మండలంలోనూ టీడీపీదే మెజార్టీ



రాప్తాడు, జూన్ 6: తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత మండలమైన ఆత్మకూరులోనూ టీడీపీ మెజార్టీ సాధించింది. టీడీపీ కూటమి అభ్యర్థి పరిటాల సునీత 1823 ఓట్ల మెజార్టీ (పోస్టల్ బ్యాలెట్ కాక) సాధించారు. 2019 ఎన్నికల్లో ఆత్మకూరు మండలంలో వైసీపీకి 6418 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈసారీ ఈ మండలంలో వైసీపీకే మెజార్టీ దక్కుతుందని తోపుదుర్తి సోదరులు, వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఊహించని విధంగా ఆత్మకూరు మండలంలో ఫ్యాన్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఎమ్మెల్యే సొంత మండలంలోనే టీడీపీకి మెజార్టీ రావడంతో వైసీపీ నాయకులు డీలా పడ్డారు. తోపుదుర్తి సోదరులు ఐదు ఏళ్లలో చేసిన అరాచకాలు, దాడులు.. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయడమే ఇందుకు కారణం.

రెండు రౌండ్లు మినహా...

ఫలితాలు లెక్కింపులో ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ టీడీపీ ముందంజలోనే ఉంది. రాప్తాడు నియోజకవర్గం మొత్తం 21 రౌండ్లు లెక్కించగా.. 3, 19వ రౌండ్లు మినహా మిగతా అన్ని రౌండ్లలో టీడీపీకే మెజార్టీ వచ్చింది. 21 రౌండ్లు పూర్తయ్యే సరికి పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి పరిటాల సునీతకు 1,16,140 ఓట్లు రాగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి 92,811 ఓట్లు వచ్చాయి. కూటమి అభ్యర్థి పరిటాల సునీత 23,329 మెజార్టీతో గెలుపొందారు.

రూరల్ మండలంలోనూ ఫ్యాన్ డీలా

ఎన్నికల ఫలితాల్లో అనంతపురం రూరల్ మండలంలోనూ ఫ్యాన్ డీలా పడింది. ఊహించని విధంగా ఓటర్లు టీడీపీకి జై కొట్టారు. 2019 ఎన్నికల్లో అనంతపురం రూరల్ మండలంలో వైసీపీకి 10,320 ఓట్లు మెజార్టీ వచ్చాయి. ఈ సారి కూడా రూరల్ మండలంలో ఆరు వేల ఓట్లు మెజార్టీ వస్తాయని వైసీపీ నాయకులు భావించారు. అయితే ఓటర్లు టీడీపీకే పట్టం కట్టారు. టీడీపీ కూటమి అభ్యర్థి పరిటాల సునీతకు 6,139 ఓట్లు మెజార్టీ (పోస్టల్ బ్యాలెట్ కాక) ఇచ్చారు.

చెన్నేకొత్తపల్లిలో టీడీపీ హవా...

చెన్నేకొత్తపల్లి మండలంలో 2019 ఎన్నికల్లో వైసీపీ 4,731 ఓట్లు మెజార్టీ సాధించింది. ఈ సారి పరిటాల సునీత 262 మెజార్టీ (పోస్టల్ బ్యాలెట్ కాక) సాధించారు. 2019లో రాప్తాడు, కనగానపల్లి మండలాల్లో కూడా వైసీపీ మెజార్టీ సాధించింది. ఈసారి టీడీపీ రాప్తాడులో మండలంలో 3,676, కనగానపల్లి 3,652, రామగిరి 6,644 ఓట్లు మెజార్టీ సాధించింది.

68 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకే మైజార్టీ

అనంతపురంరూరల్: మండలంలోని 88 పోలింగ్ కేంద్రాలకు గాను... 68 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీకే మైజార్టీ వచ్చింది. కేవలం ఇరవై కేంద్రాల్లో మాత్రమే వైసీపీకి మైజార్టీ వచ్చింది. ఇందులోనూ కేవలం రెండింటిలో మాత్రమే వైసీపీకి వందకుపైగా మెజార్టీ ఓట్లు వచ్చాయి మరో ఐదింటిలో 50కుపైగా రాగా.. మిగిలిన వాటిలో పది.. ఇరవై మాత్రమే మెజార్టీ దక్కింది. మండలంలోని పాపంపేట పంచాయతీ, కక్కలపల్లి పంచాయతీ, కక్కలపల్లి రూరల్ పంచాయతీ, రాచానపల్లి, కొడిమి పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉంటే అన్నింటా టీడీపీయే మెజార్టీ దక్కించుకుంది. నరసనాయునికుంట 67 శాతం, పాములరాయి గ్రామంలో 60 శాతం మెజార్టీ టీడీపీకే దక్కింది. క్రిష్ణంరెడ్డిపల్లి, మన్నీల, ఆకుతోటపల్లి, ఉప్పరపల్లి, పూలకుంట, కాట్నేకాలువ, గ్రామాల్లో టీడీపీకి మంచి మెజార్టీనే వచ్చింది.

శింగనమల అభ్యర్థి స్వగ్రామంలోనూ...

బుక్కరాయసముద్రం: శింగనమల వైసీపీ అభ్యర్థి ఎం వీరాంజినేయుల స్వగ్రామమైన బండమీదపల్లి గ్రామంలో టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి 71 ఓట్లు మెజార్టీ దక్కింది. శింగనమల మండలంలోని వైసీపీ అభ్యర్థి గ్రామ పంచాయతీలోని చక్రాయపేట గ్రామ పంచాయతీలోనూ టీడీపీకి 257 ఓట్ల మెజార్టీ రావడం విశేషం. పంచాయతీలోని బూత్ నెంబర్ 89 శివపురం గ్రామంలో 113 ఓట్లు, బండమీదపల్లి గ్రామంలో 71 ఓట్లు, చక్రాయపేట గ్రామంలో 73 ఓట్లు టీడీపీ మెజార్టీ వచ్చింది. సొంత గ్రామం, పంచాయతీలోనే వైసీపీ అభ్యర్థికి మెజార్టీ రాకపోవడంతో ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.



దగ్గుపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటశివుడు యాదవ్

దగ్గుపాటికి టీడీపీ జిల్లా అధ్యక్షుడి శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్, జూన్ 6: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో దగ్గుపాటిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, రామలింగారెడ్డి, సైఫుద్దీన్, కురుబ నారాయణస్వామి, చెరుకూరి శివ ఉన్నారు.

కనగానపల్లిలో టీడీపీ నాయకులు సంబరాలు



కనగానపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, జూన్ 6: టీడీపీ భారీ విజయం సాధించడంతో కనగానపల్లి టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు గురువారం సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, సర్పంచ్ అంకే పరిమిళ రామకృష్ణ, తలారి రాజప్ప, చల్లా బాలకృష్ణ, పూజారి రాజాకృష్ణ, సరిపూటి బాలయ్య, కసుమూర్తి వెంకటేష్, పూజారి నాగభూషణం, బట్టా నాగభూషణం, మూలుగురు సంజీవు, గుగ్గిళ్ల పోతులయ్య పాల్గొన్నారు.

వై నాట్ ఫొటో ఆల్ సో



చెన్నేకొత్తపల్లి : ప్రభుత్వం మారడంతో పలు వాహనాలపై అతికించిన జగన్ స్టిక్కర్లను తొలగించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అందులో భాగంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సంచార పశువైద్య వాహనంపై అతికించిన జగన్ స్టిక్కర్లను సంబంధిత ఉద్యోగి గురువారం తొలగించారు. ఆ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్‌లో బంధించిన కొందరు గ్రామస్థులు సామాజిక మాధ్యమాల్లో 'వై నాట్ ఫొటో ఆల్ సో ..' అంటూ పోస్ట్ చేశారు.

రైతు భరోసా కేంద్రాల్లో మందుల్లేవ్..!



హంపాపురం రైతు భరోసా కేంద్రం కార్యాలయం

రాప్తాడు, జూన్ 6: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో మందుల కొరత అన్నదాతలను వేధిస్తోంది. మండలంలో రాప్తాడు, ప్రసన్నాయపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, చెర్లోపల్లి, బండమీదపల్లి, గాండ్లపర్తి, బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి, పాలచెర్లలో రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఇప్పటికే కొంత మంది రైతులు బోరుబావుల కింద వేరుశనగ సాగు చేశారు. వేరుశనగకు పూత, పిందె సమయంలో మందులు చల్లాల్సి ఉంటుంది. అలాగే వర్షాధారం కింద వేరుశనగ, కంది సాగుకు సేద్యాలు పూర్తి చేసుకుని విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. వేరుశనగ విత్తే సమయంలో... ఆ తరువాత పూత పిందె దశలో మందులు ఎక్కువగా చల్లుతారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో ప్రస్తుతం ఒక రకం మందులు (పొటాష్) మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం యూరియా, డీఏపీ, పొటాష్, 10:26:26, 14:35:14 20.20.0.13, ఇతర మందులు రైతులకు చాలా అవసరం. కాని ఏ మందులు స్టాక్ లేవు. దీంతో రైతులు ప్రైవేటు షాపుల్లో మందులు కొంటున్నారు. స్థానికంగా మందులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి రైతులు కొనుగోలు చేసి రవాణా ఖర్చులతో ఇంటి వద్దకు తీసుకుని వస్తున్నారు. దీనిపై ఏఓ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో కొన్ని మందులు ఉన్నాయని... లేని మందులు తీసుకుని వచ్చి అవసరమున్న రైతులకు అందచేస్తామని అన్నారు.

అక్రమ బిల్లులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జూన్ 6: మండలంలో ఆరునెలల నుంచి ఉపాధి, పంచాయతీ, మండల నిధులను కొంత మంది అధికారులు సర్పంచులు, ఉపాధి సిబ్బంది అక్రమ బిల్లులతో డ్రా చేశారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టీడీపీ నాయకులు ఎంపీడీఓ గీతావాణికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు శ్రీహరి ఎంపిక



చెన్నేకొత్తపలి తమ పాఠశాల విద్యార్థి శ్రీహరి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) 2023-24 విద్యా సంవత్సరానికి ఎంపికైనట్టు సీకేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ స్వర్ణలత తెలిపారు. చెన్నేకొత్తపల్లికి చెందిన నక్కాశశి, సింహాచలం దంపతుల కుమారుడు శ్రీహరి గత ఏడాది డిసెంబరు 3న ఎన్ఎంఎంఎస్ పరీక్షలు రాసి.. ఈ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. ఈ ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల ఉపకారవేతనం అందుతుందన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నార్పల,జూన్ 6: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ డెవిడ్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇంటర్, ఆ పైన చదువుకొని, 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్కిల్ హబ్ సెంటర్స్ నందు మూడు నెలల పాటు ఇచ్చే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99597 63279 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అపరిశుభ్రంగా మార్కెట్ యార్డు

అనంతపురం రూరల్, జూన్ 6: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు... అపరిశుభ్రతకు నిలయంగా మారింది. చినుకు పడితే చాలు బురద మయం అవుతోంది. మరి ముఖ్యంగా చీనీ మార్కెట్ మరింత అధ్వానంగా ఉంటోంది. దీంతో వ్యాపారులు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి యార్డు చిత్తడిగా మారింది. అడుగు తీసి అడుగు వేయాలన్నా... ఇబ్బంది నెలకొంది. యార్డులో చెత్తాచెదారాన్ని తొలగించ కపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీనికితోడు కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. చీనీ మార్కెట్ ప్రాంతంలోనే కొంత వరకు ప్రతివారం పశువుల సంత జరుగుతుంటుంది. గత శనివారం, ఆదివా రంలోను పశువుల సంత జరిగింది. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయకుండా వదిలేస్తు న్నారు. పశువుల సంత ముగియగానే చెత్తచెదారాన్ని సదరు కాంట్రాక్టర్లు తొలగిం చాల్సి ఉంది. అయితే చెత్తను అలాగే వదిలేస్తున్నారు. చేసేదేమీలేక అలానే వ్యాపారులు, కూలీలు, రైతులు మార్కెట్లో ఇబ్బందులు పడుతున్నారు.



ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం


టీడీపీ నాయకులను ఊరేగిస్తున్న అభిమానులు

డీ.హీరేహాళ్, జూన్ 6: చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలలో టీడీపీ ఘనవిజయాన్ని సాధించిన సందర్భంగా మండల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలు నిర్వహించారు. మండలంలోని కాదలూరు గ్రామ పంచాయతీలోని హడగలి, బాదనహాళ్, గొడిశలపల్లి తదితర గ్రామాలలో గెలుపునకు సంబంధించిన వేడుకలు నిర్వహించుకున్నారు. మండల నాయకులను శాలువ, గజమాలలతో సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేపట్టిన మరుసటి రోజు నుండే గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి శ్రీకారం చుడతామని అన్నారు. మాజీ సర్పంచ్ రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, నాగయ్య, వండ్రప్ప, వన్నూరుస్వామి, ఓబులేసు పాల్గొన్నారు.

సైకో పాలనపై ప్రజావిజయం


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, జూన్ 6: తెలుగుదేశం పార్టీ గెలుపు సైకో పాలనపై ప్రజా విజయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. గురువారం యాడికిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్నికల్లో టీడీపీ విజయంపై కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ సైకో పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల్లో సైకోకు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. మండల కన్వీనర్ రుద్రమనాయుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, చాంద్‌బాషా, నారాయణస్వామి, నరసింహచౌదరి, జగదీష్, మృత్యుంజయనాయుడు, గోపి, రమేష్ పాల్గొన్నారు.

కేశవ్ గెలుపుతో సాయిబాబా ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూన్ 6: శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గెలుపొందడంతో సాయిబాబా ఆలయంతో టీడీపీ నాయకులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. 101 టెంకాయలు కొట్టారు. భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి ఎమ్మెల్యే ఎదగాలని ఆకాంక్షించారు. పట్టణకన్వీనర్ రామాంజనేయులు, నాయకులు బాబు, వరప్రసాద్, గంగాధర్, రామాంజనేయులు, వీరేష్, క్రిష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు


దర్గాలో టెంకాయలు కొడుతున్న నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 6: మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో మాజీ సర్పంచ్ కేశప్ప ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా కాలవ శ్రీనివాసులు అఖండ మెజార్టీతో గెలవాలని సయ్యద్ సర్మస్‌వలి దర్గాలో మొక్కులు కోరుకోవడంతో గురువారం ముతవల్లీలతో ప్రార్థనలు నిర్వహించి టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. కేపీ వన్నూరుస్వామి, వీఎల్ రామాంజనేయులు, ఆనంద్, ముక్కన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, సర్మాస్‌వలి, మహ్మద్ రఫీ, మొండి చెన్నప్ప, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

విడపనకల్లు: ఉరవకొండ నియోజకవర్గంలో పయ్యావుల కేశవ్ 21704 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందటంతో వి కొత్తకోట టీడీపీ నాయకులు బడేషావలి దర్గాలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉరవకొండలో పయ్యావుల గెలుపొంది రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే బడేషావలికి టెంకాయలు కొడతామని నాయకులు మొక్కుకున్నట్లు తెలిపారు. ఆ మొక్కును తీర్చుకునేందుకు దర్గాను చేరుకుని టెంకాయలు కొట్టారు.

బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంబరాలు


కేక్ కట్‌చేస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు


గుంతకల్లు, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించడంపై గుంతకల్లు జేఎఫ్‌సీఎం కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం వేడుకలను నిర్వహించారు. గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ కార్యక్రమానికి హాజరై కేక్‌ను కట్‌చేసి మిఠాయిలు పంచారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో ఈ ఎన్నికల్లో జయరాం గెలుపు సాధించారని, రాష్ట్రంలో టీడీపీ విజయకేతనాన్ని ఎగురవేసిందన్నారు. తమకు సహకరించిన న్యాయవాదులకు ధన్యవాదాలను తెలిపారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, లీగల్ సెల్ నాయకుడు హేమాద్రి, సీనియర్ న్యాయవాదులు లక్ష్మన్న, లక్ష్మీపతి, వెంకటనాయుడు, గురుప్రసాద్, ఆర్ బడేసాబ్, జయరాం, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ ప్రసాద్, భాస్కర్‌గౌడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయరాంకు సన్మానం

గుంతకల్లుటౌన్: టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను టీడీపీ నాయకులు గురువారం సన్మానించారు. మాజీ కౌన్సిలర్, 18వ వార్డు ఇన్‌చార్జి తలారి సరోజమ్మ, మాజీ ఎంపీటీసీ తలారి మస్తానప్ప కుటుంబ సభ్యులు జయరాంకు శాలువ వేసి పూలమాలలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ తన వార్డులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు 921 మెజార్టీ వచ్చిందని తెలిపారు.

కార్యకర్తలకు రుణపడి ఉంటాం

బెళుగుప్ప, జూన్ 6: మండలంలో మునుపెన్నడూలేని విధంగా టీడీపీ మెజారిటీ రావడానికి కృషి చేసి ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటామని మాజీ జడ్పీటీసీ నారాయణ స్వామి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ, కన్వీనర్ ప్రసాద్, మల్లికార్జున, పెద్దతిప్పయ్య, దేవప్పలను ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలివచ్చి ఘనంగా సన్మానించారు. నారాయణ స్వామి మాట్లాడుతూ మండలంలో 4773 మెజార్టీ రావడానికి కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారన్నారు. ప్రత్యేకంగా బెళుగుప్పలో 684 ఓట్ల మెజార్టీ సాధించి స్థానిక కార్యకర్తలతో కలసి కృషి చేసిన నాయకులు వన్నూరుస్వామి, పెద్దతిప్పయ్య, మల్లికార్జున, కంచిరాముడులను అభినందించారు.


నాయకులను సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

తాడిపత్రిలో భారీ వర్షం

- నియోజకవర్గంలో 152.2 మి.మీ. వర్షపాతం
- పుట్లూరులో నేలకొరిగిన చెట్లు
- ఉరవకొండలో ఇళ్లలోకి చేరిన నీరు


దళిత వాడలో నిలిచిన వర్షపునీరు

తాడిపత్రిటౌన్, జూన్ 6: నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా 152.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాడిపత్రిలో 75 మి.మీ, యాడికి 32.04, పెద్దవడుగూరు 23.02, పెద్దపప్పూరు 21.04 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. పట్టణంలోని దళితవాడ, కృష్ణాపురం జీరో రోడ్డు జలమయమయ్యాయి.

ఉరవకొండ: పట్టణంలో బుధవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా వర్షం పడింది. దీంతో పాత బస్టాండ్, టవర్‌క్లాక్ కూడలిలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అలాగే గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మండలంలోని వైరాంపురంలో వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్త చేస్తున్నారు. సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

యల్లనూరు: మండలంలో బుధవారం రాత్రి 80 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండురోజుల నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. బుధవారం రాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు గంటలపాటు వర్షం కురవడంతో మండలకేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో వంకలు పొంగిపొర్లాయి. గురువారం మధ్యాహ్నం మరోసారి వర్షం కురిసింది. ఈ వర్షంతో పండ్లతోటల రైతులకు ఊరట లభించింది.

బెళుగుప్ప: మండలంలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులకు జలకళసంతరించుకుంది.

రాయదుర్గం: భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం గురువారం సాయంత్రం పట్టణంలో కురిసింది. వర్షం నీరు ఉధృతంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రవహించింది. రామస్వామివీధి, కొలిమివీధి, మధుటాకీస్ ప్రాంతం, దుగ్గిలమ్మ గుడి ప్రాంతం, సెయింట్‌పాల్ ఏరియా, ప్యాలెస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో వర్షంనీరు భారీగా ప్రవహించింది. ఎగువ ఉన్న కొండ ప్రాంతాల నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించి ప్రధాన రోడ్లపై చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా లక్ష్మీబజార్ ప్రాంతంలో రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించాయి.

పుట్లూరు: మండలంలో గురువారం తెల్లవారుజామున ఓ మోస్తారు వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో నీటికుంటలు నిండాయి. వంకలు వర్షపునీటితో పొంగిపొర్లుతున్నాయి. ఈదురుగాలులకు పుట్లూరులోని చెరువుకట్ట వద్ద ఉన్న భారీవృక్షం నేలకొరిగింది. 31.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షం రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


పుట్లూరులో నేలకొరిగిన చెట్టు

చెరువు వద్ద రైతుల ఆందోళన

కణేకల్లు, జూన్ 6: మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు గురువారం శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువులోకి నీరు చేరుతోందని, నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా చెరువు షెట్టర్లను ఎత్తి నీటిని వృథాగా వదులుతున్నారన్నారు. దీంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. చెరువులో నీరు అలాగే ఉంటే మరో వారం రోజుల్లో మాగాణి భూముల్లో నార్లు వేసుకోవచ్చన్నారు. హెచ్చెల్సీ అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా షెట్టర్లకు తాళాలు వేయాలని వారు డిమాండ్ చేశారు.

నిన్న వైసీపీకి ప్రచారం.. నేడు టీడీపీకి సన్నిహితం


ఎమ్మెల్యే కాలవతో వలంటీర్ భాస్కర్

బొమ్మనహాళ్, జూన్ 6: మండలంలోని షైలాపురం గ్రామంలో ఓ వలంటీర్ నిన్న, మొన్నటి వరకు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసి నేడు గెలిచిన అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పంచన చేరాడు. షైలాపురం గ్రామానికి చెందిన వలంటీర్ భాస్కర్ వైసీపీ జెండాను ద్విచక్రవాహనానికి కట్టుకుని ప్రచారం చేసిన వ్యక్తి నేడు టీడీపీ అధికారంలోకి రాగానే కాలవ శ్రీనివాసులు పంచన చేరాడు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీ పక్కన ఉండడం అతని నైజం అని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.


వైసీపీ జెండాతో వలంటీర్

కాలవ భరత్‌కు సన్మానం


కాలవ భరత్‌ను సన్మానిస్తున్న తెలుగు యువత నాయకులు

రాయదుర్గం రూరల్, జూన్ 6: పట్టణంలోని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వగృహంలో యువనాయకుడు కాలవ భరత్‌ను గురువారం తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయదుందుభి మోగించడంతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు అభినందనలు తెలిపారు. తనయుడు భరత్‌ను ఘనంగా సన్మానించారు. త్వరలోనే మంత్రి పదవి చేపట్టాలని ఆకాంక్షించారు. కోదండ, వెంకటస్వామినాయుడు, ప్రసన్న, శివానంద పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు


కణేకల్లులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కణేకల్లు, జూన్ 6: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ జెండా కట్ట వద్ద నాయకులు కోకుర్తి సుదర్శన్, సలీం, ఓబుళేశు, వరుణ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చారు. అలాగే దిగువగేరిలో ఆ పార్టీ నాయకులు జిలాన్, ఫక్రుద్దీన్, శేఖర్, అనిల్, మంజు, వెంకటేశులుతో పాటు పలువురు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

మొక్కలు నాటిన పెన్నా సిబ్బంది

తాడిపత్రిటౌన్, జూన్ 6: మండలంలోని తలారిచెరువు గ్రామసమీపంలో ఉన్న పెన్నాసిమెంట్ పరిశ్రమ ఆవరణలో గురువారం సిబ్బంది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 300 మొక్కలు నాటారు. పరిశ్రమ చీఫ్ జనరల్ మేనేజర్ క్రిష్ణయ్యయాదవ్ మాట్లాడుతూ భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపకత అనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి పరిరక్షించాలని ఆయన కోరారు. మైన్స్ మేనేజర్ రామకృష్ణారెడ్డి, సిబ్బంది రాంప్రసాద్, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

హెచ్చెల్సీ మరమ్మతుకు ప్రతిపాదన

బొమ్మనహాళ్, జూన్ 6: తుంగభద్ర ఎగువ కాలువ 105 కి.మీ. నుంచి దెబ్బతిన్న కాలువ మరమ్మతుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. హెచ్చెల్సీ కాలువ 119/400 కి.మీ. వద్ద వర్షపు నీటి ప్రవాహానికి యూటీ అండర్ టన్నెల్ చానల్ దెబ్బతినడంపై మరమ్మతుకు ప్రతిపాదన పంపుతున్నామని ఆయన తెలిపారు. ఈఈ రమణారెడ్డి, కణేకల్లు హెచ్చెల్సీ డీఈ మద్దిలేటితో కలిసి కణేకల్లు, బొమ్మనహాళ్‌లలో కాలువను పరిశీలించారు. దర్గాహోన్నూరు వద్ద వర్షపు నీటి ప్రవాహానికి కాలువగట్టు దెబ్బతిందని వారు తెలిపారు. తక్షణమే మరమ్మతుల కోసం ప్రతిపాదన పంపిస్తామని తెలిపారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా


ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జూన్ 6: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఉద్దేహాళ్ వేదవతి హగరి నది ఒడ్డున ఉన్న చింతవనం నుంచి అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు. శ్రీధరఘట్ట గ్రామంలోని వైసీపీకి చెందిన ఓ నాయకుడు తన ట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం లేనంత మాత్రాన తమకు అడ్డుచెప్పేవారు ఎవరు అనే రీతిలో వైసీపీకి చెందిన కొందరు బరితెగించి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలను ప్రజలు కోరుతున్నారు.

రైతులతో.. సాగుకు సమాయత్తం

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 6: రైతులతో సాగుకు సమాయత్తం అనే కార్యక్రమాన్ని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ మద్దిలేటి గురువారం నిర్వహించారు. ఆయన రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వర్షాధారంగా రైతులు సాగు చేయనున్న వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఇందులో రైతులకు వచ్చిన పలు సందేహాలను శాస్త్రవేత్త అధికారులు తగు సూచనలు చేశారు. ఏడీఏ శైలజ, డీఆర్సీ వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున, సహాయ వ్యవసాయ సంచాలకులు యల్లప్ప, వ్యవసాయాధికారి జగదీష్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన గనుల సర్వే


మైనింగ్ కొండల్లో సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న సర్వేబృందం

రాయదుర్గం, జూన్ 6: అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న కర్ణాటక లీజు మైనింగ్ గనుల సర్వే గురువారం నాటితో ముగిసింది. వారంరోజుల పాటు కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాలలో ఉన్న ఇనుపగనులలో పర్యటించిన కేంద్రబృందం సర్వే ప్రక్రియను పూర్తి చేసి నివేదికను సీఈసీకి సమర్పించనున్నట్లు ముఖ్యంగా కర్ణాటకకు సంబంధించిన టుముటి, విఠలాపురం, బేలూరు గ్రామాల పరిధిలో టీ నారాయణరెడ్డి, మహబూబ్ ట్రేడర్స్, హింద్ ట్రేడర్స్, బళ్లారి మైనింగ్ కంపెనీ, విబూదిగుడ్డ మైనింగ్ కంపెనీ, రత్నమైనింగ్, సుగులమ్మగుడ్డ మైనింగ్ గనుల లీజుల సరిహద్దులను సర్వే చేశారు. వీటిలో మూడు గనులకు సంబంధించి వారికి కేటాయించిన లీజులను ఆంధ్ర ప్రాంతంలో కొంతభాగం ఉన్నట్లు సర్వేబృందం నిగ్గుతేల్చినట్లు తెలియవచ్చింది. కర్ణాటక ప్రభుత్వం లీజులను పునరుద్ధరించేందుకు చేపట్టిన సర్వేలో సుమారు 300 మీటర్ల దాకా అంతర్రాష్ట్ర సరిహద్దులో చొరబడినట్లు తెలుస్తోంది. కాకపోతే దీనిపై లీజులు కేటాయింపు సమయానికి ఇరురాష్ట్రాల సరిహద్దులు వివాదంలో ఉండేది. సర్వే ప్రక్రియకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను రెండురోజుల్లో సిద్ధం చేస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. సర్వే కార్యక్రమంలో డీఎఫ్ఓ వినీత్‌కుమార్, డీఎస్ఎల్ఓ రూప్లానాయక్, మైనింగ్ సర్వేయర్ భాస్కర్‌రెడ్డి, అహాడా సర్వేయర్ శరత్‌బాబు, కర్ణాటక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజు, సీనియర్ జియాజిలిస్టు చంద్రు, జేఈ నవీన్, మండల సర్వేయర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 6: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సజావుగా జరగడానికి సహకరించిన రాజకీయపార్టీల వారికి జిల్లా ఎస్పీ గౌతమి శాలి ధన్యవాదాలు తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్, మొబైల్ టీం, స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, నేరానికి పాల్పడిన ఎవరైనా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉరవకొండ: గొడవలు, అల్లర్లకు దిగితే ఎవరినీ ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. పట్టణంలోని టవర్‌క్లాక్, పాతపేట, గాంధీ బజార్‌లో గురువారం ఆమె పర్యటించారు. ఎన్నికలు, పోలింగ్ తర్వాత పరిస్థితులపై ఎస్పీ ఆరా తీశారు. సమస్యాత్మక కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిరంతరం మొబైల్ పార్టీలతో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఇంకా అవసరమనుకుంటే పట్టణంలోనే కాకుండా గ్రామాల్లో కూడా పికెట్‌లు ఏర్పాటు చేసుకోవాలని సీఐ, ఎస్ఐలకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. డీఎస్పీ, సీఐలతో సమావేశమయ్యారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ గౌతమిశాలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలైన వినాయకసర్కిల్, లక్ష్మీబజార్, పైతోట, బీటీపీ రోడ్డు, మారెమ్మ గుడి తదితర ప్రాంతాలను పరిశీలించి అక్కడ స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఊసరవెల్లి రాజకీయాలు మానుకో ఉమా

- ప్రజాస్వామ్యం గురించి రంగయ్య మాట్లాడటం విడ్డూరం


మాట్లాడుతున్న వైపీ రమేష్

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 6: ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని వైసీపీ నాయకుడు ఉమామహేశ్వరనాయుడుకు టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు వైపీ రమేష్ సూచించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు ఉమామహేశ్వరనాయుడు సానుభూతి కోసమే తన ఇంటిపై మనుషులతోనే దాడి చేయించుకుని అమిలినేని సురేంద్రబాబుపై నెట్టడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. అమిలినేని సురేంద్రబాబుని టీడీపీ అధిష్ఠానం ప్రకటించినప్పటి నుంచి ఉమా తన అనుచరవర్గంతో అనేక దఫాలుగా దాడులు చేయిస్తే అప్పుడు గుర్తుకురాని ప్రజాస్వామ్యం ఇప్పుడు తలారి రంగయ్యకు మాట్లాడే అర్హత లేదన్నారు. అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు ధర్మతేజపై రాళ్ల దాడి జరిగినప్పుడు, తనయుడు యశ్వంత్ చౌదరిపై పోలీస్ స్టేషన్ ఆవరణలోనే వైసీపీ మూకలు రాళ్లదాడికి తెగబడినప్పుడు లేవని నోరు ఉమాపై ఆయన మనుషులే దాడి చేస్తే అసత్యపు దాడులను ఖండించడానికి మాత్రమే పనికి వస్తుందని ఎద్దేవా చేశారు. సౌమ్యుడైన సురేంద్రబాబు ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారి కళ్యాణదుర్గం వచ్చినప్పుడు టీ సర్కిల్లో నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడారు కానీ టీడీపీ కార్యకర్తలు నాయకులు సామరస్యంగా వుండాలని పిలుపునిచ్చారన్నారు. మండల కన్వీనర్ గొల్ల వెంకటేశులు, బీజేపీ జిల్లా కార్యదర్శి సోమశేఖర్, జనసేన, నాయకులు పాల్గొన్నారు.

కాజ్‌వే ఏర్పాటుకు నిధుల మంజూరు


వర్షానికి కొట్టుకుపోయిన రహదారిని పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

కణేకల్లు, జూన్ 6: కణేకల్లు-మాల్యం గ్రామాల మధ్య వేదవతి హగరిలో లోలెవెల్ కాజ్‌వే ఏర్పాటుకు రూ.6 కోట్లు నిధులు మంజూరైనట్లు పీఆర్ డీఈ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి కణేకల్లు-మాల్యం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి కొట్టుకుపోగా స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ ఇప్పటికే ఈ రహదారికి సంబంధించిన పూర్తిస్థాయి సర్వే రిపోర్ట్ అంతా ఉన్నతాధికారులకు అందజేశామని, త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉందన్నారు. అనంతరం టీడీపీ కన్వీనర్ లాలెప్ప మాట్లాడుతూ ప్రస్తుతం వర్షానికి కొట్టుకుపోయిన రహదారిలో తాత్కాలిక మరమ్మతులు చేయడం గానీ లేకపోతే హెచ్చెల్సీ అధికారుల అనుమతితో కాలువపై రాకపోకలకు చర్యలు తీసుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు కొట్టుకుపోయిన రహదారిని పరిశీలించామని త్వరలోనే దీనిపై చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, అనిల్, చాంద్‌బాషా, వెంకటేశులు, నాగభూషణం, ఈరప్ప, తిప్పేస్వామి, గోపాల్, జిలాన్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


అశ్విని (ఫైల్)

పెద్దపప్పూరు, జూన్ 6: మండలంలోని ముచ్చుకోట గ్రామానికి చెందిన అశ్విని (21) చదువు ఇష్టం లేక గురువారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, కమ్మక్కల కుమార్తె అశ్విని కొన్నేళ్లక్రితం చదువును మధ్యలోనే ఆపేసింది. కొన్ని రోజుల నుంచి చదువును కొనసాగించాలని కుటుంబ సభ్యులు చెబుతూ ఒత్తిడి చేసేవారు. చదువు ఇష్టంలేని అశ్విని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇంకా వివాహం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రాళ్లదాడి కేసులో 11మంది అరెస్ట్

తాడిపత్రిటౌన్, జూన్ 6: పట్టణంలో గత నెల 13, 14న జరిగిన రాళ్ల దాడి కేసులో గురువారం వైసీపీకి చెందిన 11 మందిని అరెస్ట్‌చేసినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నిందితులను పట్టణ సమీపంలోని రమేష్‌రెడ్డికాలనీ వద్ద అరెస్ట్ చేశామన్నారు. వైసీపీకి చెందిన రవితేజారెడ్డి, శైక్షాంజో బాబా, ప్రభాకర్, నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు మరో ఏడుగురిని అరెస్ట్ చేసి గుంతకల్లు కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరికి కోర్టు 15 రోజులు రిమాండ్ విధించడంతో కడప జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

రాయదుర్గం రూరల్, జూన్ 6: పట్టణ సమీపంలోని పైతోట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంజు(13) మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు గురువారం సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలం చౌళూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు కుమారుడు పట్టణ సమీపంలోని పైతోటకు బంధువుల ఇంటి వద్ద మంజు ఆడుకుంటుండగా మొలకాల్మూరు నుంచి రాయదుర్గానికి వెళుతున్న కారు ఢీ కొట్టింది. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూల్‌డ్రింక్స్ దుకాణంలో చోరీ

రాయదుర్గం రూరల్, జూన్ 6: పట్టణంలోని శాంతినగర్‌లో కూల్‌డ్రింక్స్ దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడుతున్నట్లు షాప్ యజమాని కృష్ణ తెలిపారు. దుకాణానికి రంధ్రం పెట్టి చోరీకి పాల్పడిన విషయాన్ని గురువారం తెల్లవారుజామున కనుక్కున్నట్లు ఆయన తెలిపారు. దుకాణంలో ఉంచిన రూ.70 వేల సరుకు చోరీకి గురైనట్లు తెలిపారు. గుట్కా, కూల్‌డ్రింక్స్, సిగరెట్‌ప్యాక్‌లతో పాటు రూ.25 వేలు దేవుని హుండీ, రూ.20 వేలు ఇతర వస్తువులు మొత్తం రూ.70 వేలు సరుకు చోరీ చేసినట్లు తెలిపారు. సంఘటపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దవడుగూరు, జూన్ 6: మండలంలోని కిష్టిపాడు జాతీయరహదారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో యాడికి మండలానికి చెందిన మల్లికార్జున, పరమేశ్వర గాయపడ్డారు. ఇరువురు వ్యక్తిగత పనుల నిమిత్తం గుత్తికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైకు అపహరణ

బెళుగుప్ప, జూన్ 6: మండలంలోని అంకంపల్లికి చెందిన వీఆర్ఏ మహేష్ బైకుని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గత నెల 31వ తేదీ రామసాగరం క్రస్ వద్ద ఆపి ఆఫీస్ పని నిమిత్తం బెళుగుప్పకు వెళ్లారు. పని ముగించుకుని వెళ్లి చూడగా బైకు లేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని విచారించాలంటూ గురువారం వీఆర్ఏ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 6: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీటీ ఆస్పత్రి వరకు స్పెషల్ పార్టీ పోలీసులు, డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పోలీసులు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

అంధకారంలో ఉద్దేహాళ్

బొమ్మనహాళ్, జూన్ 6: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ బీసీ కాలనీ రెండురోజులుగా అంధకారంలో ఉందని కాలనీవాసులు వాపోయారు. విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో లైన్లు సక్రమంగా నిలబడడం లేదని వాటిని మరమ్మతులు చేయడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు తెలిపారు. రెండురోజులుగా విద్యుత్ సరఫరా లేక అవస్థలు పడుతుంటే అధికారులు స్పందించడంలేదని వాపోతున్నారు. విద్యుత్ అధికారులకు విషయం తెలిసినా శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.